క్లుప్తంగా

రేపు విజయదుర్గమ్మ ఆలయంలో చండీ హోమం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 5వ తేదీన చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి చండీహోమ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఈ చండీ హోమం నందు నలుగురు దంపతులు మాత్రమే ఉభయదారులుగా పాల్గొనుటకు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా ఆలయ కమిటీ వారిని సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

మదనగోపాలునికి తులసీ దళారాధన


స్వామికి తులసీ దళారాధన నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని మూలవిరాట్ విగ్రహానికి తులసీదళారాధన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఈ నెల 5వ తేదీన ఏకాదశి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఈవో టి.లక్ష్మి తెలిపారు. అనంతరం భగవద్గీత పద్దెనిమిది అధ్యాయముల పారాయణం నిర్వహిస్తారని, భక్తులు పారాయణంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

శ్రీవారి గోశాలలో కుందేళ్ల సందడి


గోసంరక్షణశాలలో గెంతుతున్న కుందేళ్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి కొండపైన గోసంరక్షణశాలలో కుందేళ్ల సందడి చేస్తున్నాయి. చెంగు చెంగుమని గెంతుతూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. గోసంరక్షణశాల సమీపంలోనే కుందేళ్ల పార్కు ఉంది. అయితే కొన్ని నలుపు, తెలుపు రంగుల కుందేళ్లను గోశాలలో ఉంచడంతో అవి అటూ, ఇటూ తిరుగుతూ అక్కడికి వచ్చే భక్తుల మదిని దోచేస్తున్నాయి.

లక్కవరం శివాలయాన్ని పరిశీలించిన అధికారులు


శివాలయాన్ని పరిశీలిస్తున్న ఈవో ఆర్‌వీ చందన, డీఈ శ్రీనివాస్ తదితరులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది దేవాలయానికి దత్తత దేవాలయమైన లక్కవరం శివాలయాన్ని ఆదివారం మద్ది ఈవో ఆర్‌వీ చందన, ఎండోమెంట్ డీఈ శ్రీనివాస్, పారిజాతగిరి ఈవో కలగర శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. శివాలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. దీనికి మ్యాచింగ్ గ్రాంటుగా గ్రామస్తులు రూ.50 లక్షలు జమ చేశారు. దీంతో ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో ఉన్న రామాలయానికి చెందిన కాలక్షేప కళ్యాణమండపాన్ని కూడా పరిశీలించారు. దానిని వ్యాపార వర్గాలకు గోడౌన్‌గా లీజుకు ఇచ్చేందుకు ఆలోచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో స్నేహితుల దినోత్సవం


కల్పవృక్షం వద్ధాశ్రమంలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్నేహితుల దినోత్సవాన్ని రోటరీ క్లబ్ ఆధ్వర్యాన కల్పవృక్షం వృద్ధాశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాజేటి సత్యనారాయణ, కార్యదర్శి కనిగళ్ళ రామచంద్రరావుల ఆధ్వర్యంలో వృద్ధులందరికి ఫ్రెండ్‌షిప్ డే బ్యాండ్లను కట్టి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాశ్రమంలో స్నేహితుల దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందని సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చోడిపిండి సుబ్రహ్మణ్యం, ఐలూరి విశ్వనాథ శర్మ, మాజేటి అప్పలరాజు, మజ్జి సూరిబాబు, చిరవూరి శ్రీనివాస్, మద్దు గోపి, యాతం సత్యనారాయణ దారం సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు తప్పనిసరి


పొలాల్లో మేత మేస్తున్న పశువులు

బుట్టాయగూడెం: రైతులకు వ్యవసాయం ప్రధాన వృత్తి అయినప్పటికీ పశుపోషణతో అదనపు ఆదాయం పొందే వీలుంటుంది. వ్యవసాయం ద్వారా సీజన్ల వారీగా ఆదాయం సమకూరితే.. పశుపోషణతో ప్రతి నెలా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో పశు పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం వానాకాలం కావడంతో పశువులను అనేక రోగాలు ఆశించే ప్రమాదం ఉంది. పశు సంపద అభివృద్ధి చెందాలంటే వాటికి పోషణతో కూడిన ఆహారం అందించడం చాలా అవసరం. తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు, పదార్థాలు, ఖనిజ, లవణాలు, విటమిన్లు నీరు అవసరమవుతాయి. వీటిని పశువులకు సక్రమంగా అందేలా పాడి రైతులు కృషి చేయాలని పశువైద్యులు చెబుతున్నారు.

పిండి పదార్థాలు

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు, అంతర్గతంగా అవయవాల దెబ్బల నుంచి పిండి పదార్థాలు కాపాడుతాయి. అలాగే శరీరంలో ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించడంతో పాటు పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే పిండి పదార్థాలు శక్తిని అందిస్తాయి. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడు, వంటి వాటిలో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

మాంసకృత్తులు

పశువుల శరీర నిర్మాణానికి, ఎదుగుదలకు, రోగ నిరోధక శక్తికి మాంసకృత్తులు తోడ్పడతాయి. శరీరానికి శక్తిని సరఫరా చేస్తాయి. పెయ్యిల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్కచిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశెనగ పిండి, నువ్వుల పిండి, చేపల పిండి, మాంసం పొడి వంటి ముడి పదార్థాలు పప్పు జాతికి చెందిన పశు గ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

పశువులకు నీరు చాలా అవసరం

మేత లేకుండా పశువులు మూడు నెలల పాటు బతకగలిగినా, నీరు లేకుండా ఐదు రోజుల మించి ఉండలేవు. శరీర జీవన ప్రక్రియలకు, ఉత్పాదకతకు నీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలను శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగించడానికి, శరీర ద్రవాల పీహ సాధారణ స్థాయిలో ఉంచేందుకు చర్మం సాగు గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైమ్‌ల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు దోహదపడుతుంది. పశువులకు నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధిత వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం, తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడడానికి పశువులు డీహైడ్రేషన్‌కు గురై మరణిస్తాయి. కాబట్టి పశువులకు అత్యంత అవసరమయ్యే పోషక పదార్థాల్లో ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల నీరు అవసరం.

> **వర్షాకాలంలో జాగ్రత్తలు అవసరం**
>
> 
>
> వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. పశువులకు ఎటువంటి వ్యాధులు సోకినా వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి. అవసరమైన వైద్య సేవలు అందించాలి. ప్రస్తుతం వ్యాధులు సోకకుండా పశులకు టీకాలు వేస్తున్నాం.
>
> – డాక్టర్ మల్లంపల్లి సాయిబుచ్చారావు, సహాయ సంచాలకులు, జీలుగుమిల్లి

సీఐటీయూ మహాసభను విజయవంతం చేయండి

కుక్కునూరు: స్థానిక చర్చి హాస్టల్ నందు సోమవారం నిర్వహించనున్న సీఐటీయూ 7 వ మండల మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మహాసభలో కార్మికుల సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నట్లు చెప్పారు. మూడేళ్లకు సంబంధించి పోరాటాలపై సమీక్ష జరిపి నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభకు సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎక్సైజ్ దాడులు

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం సీఐ కె. బలరామరాజు ఆదేశాల మేరకు ఎస్సైలు పీవీవీఎన్ ఉమామహేశ్వరరావు, పి.సునీల్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. లోసరి గ్రామానికి చెందిన కొప్పినేటి నాగరాజును అదుపులోకి తీసుకుని, 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోటార్‌సైకిల్ చోరీ

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై డి.శశాంక తెలిపారు. నిమ్మలగూడెంకు చెందిన తుమ్మల రాంబాబు ఈ నెల 29వ తేదీ రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లో నిద్రించాడు. ఉదయం లేచి చూడగానే ద్విచక్రవాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా వాహనం ఆచూకీ లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

పెదవేగి: శ్రీకృష్ణ భగవానుడని దైవంగా గుర్తించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్ కుమార్ అన్నారు. ఈనెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ఆదివారం అంకన్నగూడెంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలన్నారు. పూర్వం శ్రీకృష్ణాష్టమి 11 రోజుల పాటు ఊరేగింపు చేసేవారని చివరిగా చవితి రోజున ఊరేగింపు ముగించే వారని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


రోడ్డుపై ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

జంగారెడ్డిగూడెం: ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడిన ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో కొబ్బరి పొట్టుతో వెళుతున్న ట్రాక్టర్ యూ టర్న్ తీసుకునే సమయంలో డివైడర్ ఎక్కి బోల్తా పడింది. ట్రక్కు బోల్తా పడిన సమయంలో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం కావడంతో ఈ ప్రాంతంలో జన సంచారం లేదని, లేకపోతే భారీ నష్టం జరిగేదని స్థానికులు చెబుతున్నారు.

చంద్రబాబు చేసిన మోసం ప్రతి గడపకూ చేరాలి


కొణిజర్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాంతారావు, నాయకులు

లింగపాలెం: సూపర్ సిక్స్ తదితర హామీలతో ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రతి గడపకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు అన్నారు. ఆదివారం కొణిజర్ల గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ అధికార దాహంతో చంద్రబాబు ఎప్పటికప్పుడు ఆశలు చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో మొదటి ఆరు నెలల్లోనే సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. చంద్రబాబు చేసిన మోసాలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, సంక్షేమం పాలన అందిస్తారని ఆశపడితే నిట్ట నిలువునా ముంచి మోసం చేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు మనం చేరువయ్యామని దానికి పారదర్శకంగా సంక్షేమాన్ని అందజేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్ట సురేష్, రాష్ట్ర లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగ సందీప్, పార్టీ మండల ఎగ్జిక్యూటివ్ సభ్యులు కాట్రు అంకమయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముల్లపూడి సుమన్, పార్టీ నాయకులు సీహెచ్ ప్రసాద్, లక్కపాము సీమోన్, పచ్చిగొల్ల వెంకటేశ్వరరావు, సోదిమల్ల రాజారావు, టి.మధు స్థానిక కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొణిజర్ల గ్రామాధ్యక్షుడిగా నిమ్మగడ్డ


నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ

లింగపాలెం: కొణిజర్ల గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నిమ్మగడ్డ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అబ్జర్వర్ వైస్ ఎంపీపీ మట్ట సురేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కొణిజర్ల గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ లింగపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా నిమ్మగడ్డ నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా సోదిమల్ల విజయభాస్కరరావు, లక్కపాము సురేష్, యాదాల నాగేశ్వరరావు, చెన్ను శివయ్య, కార్యదర్శులుగా వేల్పుల సురేష్, ముల్లంగి జయరాజు, యాదాల రాజు, తానంకి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

వైభవంగా వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం, ప్రతిష్ఠించిన వారాహి అమ్మవారి విగ్రహం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రెండో వార్డులో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉప ఆలయంగా వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కూరెళ్ల రాంబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు ప్రారంభించారు. పట్టణంలో వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయడం శుభ పరిణామమని అన్నారు. షణ్ముఖ వారాహి భక్త బృందం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త శ్రీ వీరంపాలెం బాల త్రిపుర సుందరి పీఠాధిపతి ప్రతినిధి ఈమని శశి కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛమైన కోరికలు కోరుకుంటే అమ్మవారు కటాక్షిస్తారని అన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


ఏలూరులో వైఎస్సార్‌సీపీ కామవరపుకోట మండలం గ్రామస్థాయి పరిశీలకులతో మాట్లాడుతున్న విజయరాజు

కామవరపుకోట: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. ఆదివారం ఏలూరులో తన స్వగృహంలో కామవరపుకోట మండలానికి చెందిన నూతనంగా నియమితులైన గ్రామ స్థాయి పరిశీలకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ గ్రామ కమిటీల ఎంపిక కోసం చేయాల్సిన కార్యాచరణ, వాటి అనుబంధ సంఘాల నియమాకంపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీల నియమాకం త్వరతగతిన పూర్తి చేయాలని పరిశీలకులకు తెలియజేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వంపై ప్రజలో పూర్తి వ్యతిరేకత కనపడుతుందని, రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, ధైర్యంతో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కామవరపుకోట మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కీసర సరితా భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు కె.రామకృష్ణ, వైస్ ఎంపీపీలు తమ్మిశెట్టి గిరిజా, కనికెళ్ళ రత్నకుమారి, ఎంపీటీసీలు కనుమూరి అంజిరెడ్డి, బొల్లు వెంకట సత్యనారాయణ, మేడంకి పద్మ, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయిన కనకరాజు, కనుమూరి ప్రసాద్ రెడ్డి, నల్లూరి ప్రభాకర్, కొమ్మిన నరేష్, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై ఇంటింటి ప్రచారం


వేలేరుపాడు: స్మార్ట్ మీటర్ల వలన కలిగే నష్టాలను రుద్రకోటలో వివరిస్తున్న సీపీఐ నాయకులు

కుక్కునూరు: స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని కోరుతూ ఆదివారం వామపక్షాల ఆధ్వర్యంలో మండలంలోని చిరవెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వం ప్రజలపై మోపే భారాన్ని వివరించి ప్రజల వద్ద నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు కొన్నె లక్ష్మయ్య, వై నాగేంద్రరావు మాట్లాడుతూ ప్రజలు స్మార్ట్ మీటర్లు వద్దని గగ్గోలు పెడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయకపోతే ప్రజలే ప్రభుత్వంపై యుద్ధం చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో యర్నం సాయికిరణ్, పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సంతకాల సేకరణ

టి.నరసాపురం: విద్యుత్ బిల్లుల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు తదితర సమస్యలపై ఆదివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో ప్రజాసంఘాల నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బీఎన్.సాగర్, సీపీఎం నాయకులు జి.వెంకట్రావు, అనుమోలు మురళి, మడకం కుమారి, సీపీఐ ఎంఎల్ జనశక్తి నాయకులు కారం భాస్కర్, కొండా రాము తదితరులు పాల్గొని స్మార్ట్ మీటర్ల వల్ల వచ్చే నష్టాలను వివరించారు. భవిష్యత్తులో విద్యుత్ సంస్థను క్రమక్రమంగా ఎలా ప్రైవేటీకరణ చేస్తారో ప్రజలకు వివరించి సంతకాలను సేకరించారు. ఈనెల 5వ తేదీన జరిగే సబ్ స్టేషన్ల ముట్టడి కార్యక్రమానికి మండలంలోని ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ధర్నాను జయప్రదం చేయండి

వేలేరుపాడు: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్ పిలుపునిచ్చారు. ఆదివారం వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామంలో స్మార్ట్ మీటర్లు బిగించడం వలన కలిగే నష్టాలను సీపీఐ నాయకులతో కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా ప్రసాద్, మండల కార్యదర్శి బాడిశ రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ఆటో ఢీకొని గాయాలపాలైన పెంటయ్య, కుమారి

బుట్టాయగూడెం: ఆటో ఢీకొని మోటార్‌సైకిల్‌పై వెళుతున్న భార్యభర్తలు గాయపడిన ఘటన కంద్రికగూడెం సాయిబాబాగుడి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దొరమామిడి సమీపంలోని నిర్వాసిత గ్రామం సరుగుడుకు చెందిన ఇరపా పెంటయ్య, భార్య కుమారి రాజానగరంలో చదువుతున్న తమ కుమార్తెను చూసేందుకు ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. కంద్రికగూడెం సాయిబాబా గుడి సమీపంలోకి వచ్చేసరికి కన్నాపురం నుంచి ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో వారి వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో పెంటయ్యకు తీవ్ర గాయాలు కాగా, అతని భార్య కుమారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఢీ కొట్టిన ఆటోలోనే స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువచ్చారు. ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పెంటయ్య కుడికాలుకు అయిన గాయానికి 16 కుట్లు వేసినట్లు వైద్యులు తెలిపారు.

'మానవత'కు రూ.లక్ష విరాళం


మానవతకు విరాళం అందజేస్తున్న తడికలపూడి శాఖ అధ్యక్షుడు గాంధీ

కామవరపుకోట: తడికలపూడి మానవత శాఖకు అధ్యక్షుడు పావులూరి చంద్రలాల్ గాంధీ ఆదివారం రూ.1,00,116 విరాళం అందజేశారు. మానవత వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రరెడ్డి, విద్యానిధి కమిటీ చైర్మన్ అలపాటి నాగేశ్వరావు సమక్షంలో విరాళం చెక్కును అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ విరాళం అందజేస్తున్నట్లు చంద్రలాల్ గాంధీ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గంగాధర ప్రసాద్, నెక్కలపూడి సురేష్ బాబు, ఈడ్పుగంటి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అల్పాహారం అందజేత


చిన్నారులకు అల్పాహారం అందజేసిన హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవ ఆశ్రమంలోని పిల్లలకు అల్పాహారం, పండ్లు అందజేశారు. హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు శ్రీ బొల్లిన గంగరాజు, యర్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు గమ్య తనుజ, మానస, గాయత్రి, కోరం ఆంజనేయులు, పెద్దిరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పెదవేగి: పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం జానంపేటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి, పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1940 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.